నామినేటెడ్ పోస్టుల్లో
బీసీ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి


మంత్రి పొన్నం ప్రభాకర్‌తో భాగ్యలక్ష్మి

బర్కత్‌పుర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల్లో బీసీ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం. భాగ్యలక్ష్మి కోరారు. ఆరెకటిక, ముదిరాజ్, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, గొల్ల కురుమ, గౌడ, మున్నూరుకాపు సంచార జాతుల మహిళా ప్రతినిధులను కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించాలని అన్నారు. శనివారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఆమె, రాష్ట్రంలోని పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశంలోనే ఆదర్శంగా నిలవబోతుందన్నారు. కులగణనలో సంచార జాతులు. ఎంబీసీ స్థితిగతులను ప్రభుత్వం సేకరించి న్యాయం చేయాలని ఆమె కోరారు.

పదోతరగతి పరీక్ష ఫీజు గడువును పొడిగించాలి


పరీక్షల డైరెక్టర్ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న లింగంగౌడ్

బర్కత్‌పుర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి జాజుల లింగంగౌడ్, ఎంబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి బడేసాబ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎస్‌సీ బోర్డులోని డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్‌లో పరీక్షల డైరెక్టర్ కృష్ణారావును కలిసి శనివారం వినతిపత్రం అందజేసినట్లు వారు చెప్పారు. పదో తరగతి పరీక్ష ఫీజు గడువు ఈనెల 18వ తేదీతో ముగియనుందని, సకాలంలో ఫీజులు చెల్లించని విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉన్నదన్నారు. చాలా మంది విద్యార్థులు ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు వారికి సంబంధించిన ఎడ్యుకేషన్ వివరాలు యుడైస్ పోర్టల్‌లో నమోదు చేసుకోలేదన్నారు. గతంలో పదో తరగతి విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే ఫీజు చెల్లించే అవకాశం ఉండేదని, విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పరీక్షా ఫీజు గడువు పొడగించాలని వారు కోరారు.


ఎమ్మెన్ శ్రీనివాసరావును సన్మానిస్తున్న రమేష్‌గాంధీ తదితరులు

యువత ఆధ్యాత్మికచింతనను అలవర్చుకోవాలి

చిక్కడపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యువత ఆధ్యాత్మికచింతనను అలవర్చుకోవాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాసరావు సూచించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా గాంధీనగర్ డివిజన్ చిక్కడపల్లిలోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం రాత్రినుంచి శనివారం తెల్లవారుజామువరకు మాతాజాగరణ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెన్ శ్రీనివాసరావును నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే బీజేపీ నేతల బస్తీనిద్ర


మాట్లాడుతున్న మహేందర్

అంబర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధికోసమే బీజేపీ నేతలు మూసీ పరివాహక ప్రాంతాల్లో బస్తీ నిద్ర కార్యక్రమాన్ని చేపడుతున్నారని, ప్రజాసమస్యలు పరిష్కరించడానికి కాదని అంబర్‌పేట సీపీఎం కార్యదర్శి ఎం మహేందర్ ఆరోపించారు. శనివారం అంబర్‌పేటలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే మూసీ పరివాహక ప్రాంతంలో కొంతమంది లేఔట్లు వేసి విక్రయించగా అమాయక ప్రజలు ఆ స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకున్నారన్నారు. ఇప్పుడు వారి ఇళ్లకు, జీవనపాధికి ప్రమాదం ఏర్పడిందని, బీజేపీ నేతలు మూసీ బాధితులకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ముషీరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి అన్నారు. శనివారం మ్యాజిక్ బస్సు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్వరూపారాణి విద్యార్థులు మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. క్రీడా పోటీలలో రాణించిన విద్యార్థులకు, సర్టిఫికెట్లు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం నరేందర్ యాదవ్, సెక్రెటరీ రతన్, మ్యాజిక్ బస్సు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సాగర్ పాల్గొన్నారు.

భర్తతో గొడవపడిన భార్య అదృశ్యం


నవనీత

అంబర్‌పేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవపడిన భార్య అదృశ్యమైనది. వివరాల్లోకి వెళితే.. బాగ్ అంబర్‌పేట రామకృష్ణానగర్‌లో పవన్ భార్యా నవనీత (49) ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుతున్నాయి. గతనెల 28న ఇద్దరు గొడవపడగా, భార్య ఇంటినుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం కుటుంబ సభ్యులు అంబర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గతంలోను రెండు, మూడుసార్లు ఇంటి నుంచి వెళ్లి తిరిగి వచ్చిందని పోలీసుల చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్ తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం




కవాడిగూడ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల్లో గుర్తుతెలియని మృతదేహాలు లభ్యమయ్యాయి. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెయింట్ ఫిలోమీనా స్కూల్ వద్ద 45-50 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి ఫుట్‌పాత్‌పై మృతిచెంది ఉన్నాడు. బోయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఫుట్‌పాత్‌పై 50 ఏళ్ల వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. స్థానికులు ద్వారా సమాచారం అందుకున్న గాంధీనగర్ పోలీసులు రెండు మృతదేహాలను గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ లేదా 87126 60140 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.


సుందరయ్యపార్కు, చౌరస్తాలో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికి అక్కడే ఉంచిన దృశ్యం


బాగ్‌లింగంపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం చౌరస్తాలో చెట్ల కొమ్మలను నరికి రోడ్డుపై వేసిన దృశ్యం

చెట్లకొమ్మలను నరికారు..
రోడ్లపైనే వదిలేశారు
ప్రమాదాల బారిన వాహనదారులు, రాకపోకలకు ఇబ్బందులు


జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం వద్ద చెట్ల కొమ్మలను నరికి పడేసిన దృశ్యం


బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల మెయిన్ రోడ్డు వద్ద చెట్లను నరికివేసి అక్కడే పడేసిన దృశ్యం

రాంనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికిన ట్రాన్స్‌కో సిబ్బంది వాటిని తొలగించకుండా రోడ్డుపైనే వదిలివేశారు. దాంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు నరికివేసిన చెట్లను గమనించకుండా వాటిపై వెళ్తుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు.

ట్రాన్స్‌కో ఆజామాబాద్ డీఈ పరిధిలోని సుందరయ్యపార్కు చౌరస్తా, బాగ్‌లింగంపల్లిలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం చౌరస్తా, జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయం వద్ద, బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కళాశాల మెయిన్ రోడ్డులో మూడు, నాలుగు రోజులుగా నరికేసిన చెట్లు, కొమ్మలు రోడ్లపై ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వాటిని తొలగించాలని పలువురు వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

సత్యానగర్ సమగ్రాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

రాంనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని సత్యానగర్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పేర్కొన్నారు. సత్యనగర్‌లో రూ. 5 లక్షలతో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌తో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రతిబస్తీ, కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. సత్యనగర్‌లో నూతనంగా వేస్తున్న పైపల్‌లైన్‌తో డ్రైనేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుందని చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కె.సురేందర్, మాధవ్ చిట్టి, ముచ్చకుర్తి ప్రభాకర్, రవియాదవ్, నేత శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, కలీం, బస్తీవాసులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో కూలిన ప్రహరీని వెంటనే నిర్మించాలి

ముషీరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో కూలిన ప్రహరీని వెంటనే ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. చేపల మార్కెట్‌లో చేపలను శుభ్రం చేసే ప్రాంతంలో ప్రహరీ కూలిందని వ్యాపారులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా, శనివారం జీహెచ్ఎంసీ ఏఈ మురళీతో కలిసి చేపల మార్కెట్‌లో పర్యటించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేపల మార్కెట్‌లో క్రయ విక్రయదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే కూలిన ప్రహరీని నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు ప్రసాద్, పూసగోరక్‌నాథ్, బల్వంత్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ రాంబాబు

ముషీరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేరాలు, దొంగతనాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తున్నాయని ముషీరాబాద్ సీఐ రాంబాబు అన్నారు. బోలక్‌పూర్ డివిజన్ బాకారంలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి(మల్లన్న) ఆలయంలో, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి రూ.45 వేలు సొంత డబ్బుతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా, సీఐ రాంబాబు శనివారం ప్రారంభించారు. సామాజిక బాధ్యతగా ఆలయాలు, మసీదులు, చర్చీల నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సందర్భంగా ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి, అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డీఐ నదీం హుస్సేన్ డీఎస్ఐ చలపతిరెడ్డి, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఊర్మిల అంజిరెడ్డి, నాయకులు బిజ్జి కనకేష్ కుమార్, మహ్మద్ అలీ, మల్లికార్జున్ రెడ్డి, రామకృష్ణ ముదిరాజ్, వై.బి. రాజు, యాదగిరి, అనిల్ చారి, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి


బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసిన సయ్యద్ మసూద్ తదితరులు

ముషీరాబాద్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అసమానతలను తొలగించేందుకు సమగ్ర కులగణన సర్వే దోహదపడుతుందని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్ పేర్కొన్నారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకుడు సయ్యద్ మసూద్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు శనివారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిశారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్ డివిజన్‌లో సమగ్ర కుటుంబ సర్వేలో ఆస్తులు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలు తదితర వివరాలు చెప్పడానికి ప్రజలు ఆసక్తి చూపడంలేదని వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నిరంజన్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్రకుటుంబ సర్వే ఎవరికీ వ్యతిరేకం కాదని, సర్వే వల్ల ప్రజలకు మేలు జరగడంతోపాటు అర్హులైన వారికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ ఖరీం, మహ్మద్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అష్టలక్ష్మి ఆలయంలో..
రంగాచార్య స్మారక పురస్కారాల ప్రదానం

హైదరాబాద్‌సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మరింగంటి శ్రీరంగాచార్య 20వ స్మారక పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు కొత్తపేట్‌లోని అష్టలక్ష్మి ఆలయంలో జరగనుందని నిర్వాహకులు విజయసారథి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా త్రిదండి దేవనాథ రామానుజ జీయరుస్వామి, డాక్టర్ ఎన్‌వీ.రంగరామానుజాచార్యులు పాల్గొంటారని, ఉత్తమ సంస్కృత పండిత పురస్కారాన్ని సముద్రాల శఠగోపాచార్యులు అందుకుంటారని పేర్కొన్నారు. పురస్కార ప్రదానంతో పాటు గ్రంథాలు, ఆడియోల ఆవిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

ఆకట్టుకున్న సైన్స్‌ఫెయిర్

రాంనగర్: బాగ్ అంబర్‌పేటలోని ఆకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో 'క్రియా జాయినే -2024' పేరిట శనివారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్ ఆకట్టుకుంది. పాఠశాల రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. సైన్స్‌ఫేర్‌లో పర్యావరణం, అంతరిక్షం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రూపారెడ్డి, ఆపరేషన్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి వైస్‌ప్రిన్సిపాల్ సులక్షణ పాల్గొన్నారు

రొయ్యూరి శేషసాయికి
విశిష్ట సేవా పురస్కారం ప్రదానం

రాంనగర్: సాంస్కృతిక, సామాజిక సేవారంగాల్లో విశిష్టసేవలు అందిస్తున్న ఇండో కెనడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపకులు రొయ్యూరు శేషసాయికి విశిష్ట సేవా పురస్కారం లభించింది. శనివారం బిర్లాప్లానిటోరియంలో పాన్ ఇండియా అవార్డుల ప్రదానోత్సవంలో ప్రొఫెసర్ ఎమ్మెల్సీ కోదండారం, అంతర్జాతీయ గుర్తింపు పొందిన గజల్ శ్రీనివాస్ అవార్డును అందజేశారు.

వ్యవసాయశాఖ అధికారులకు పదోన్నతులు ఇవ్వాలి

- తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ కృపాకర్‌రెడ్డి

రాంనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన వ్యవసాయ రంగానికి, రైతులకు విశేష సేవలు అందిస్తున్న వ్యవసాయశాఖ అధికారులకు పదోన్నతులను వెంటనే కల్పించాలని తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి కృపాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో వ్యవసాయ సంఘం అధికారుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కృపాకర్‌రెడ్డి మాట్లాడుతూ దశాబ్ద కాలంగా పెండింగ్‌లో వ్యవసాయశాఖలో పెండింగ్‌లో ఉన్న ఖాళీలను భర్తీ చేసి, అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ చేపట్టే కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వైద్యనాథ్, జి కృపాకర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు కాంతారావు కోశాధికారి నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శశిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అనురాధ, కార్య నిర్వాహక క్యాదర్శి మహేందర్‌రెడ్డి, ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీఎస్టీ పార్కులో ఉచిత వైద్య శిబిరం


వాకర్స్‌కు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాంనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ట్విన్ సిటీస్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీఎస్టీ చౌరస్తాలోని జీహెచ్ఎంసీ పార్కులో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కందూరి కృష్ణ హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. పార్కులోని వాకర్స్‌కు వైద్యులు బీపీ, షుగర్ తదితర పరీక్షలను చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు హెచ్ గోవింద్‌రావు, మురళీధర్, డాక్టర్ సంగీత, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంలోనే బోధన చేయాలి


శిక్షణ పొందిన అధ్యాపకులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పద్మావతి

రాంనగర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతన విద్యా విధానంలోనే విద్యార్థులకు బోధన చేయాలని, అందుకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ తరగతులు అధ్యాపకులకు దోహదపడతాయని ఉస్మానియా యూనివర్సిటీ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ పద్మావతి పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాల ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ పద్మావతి జాతీయ ఎడ్యుకేషన్ పాలసీ-2020లో భాగంగా మల్టీ డిసిప్లీనరీ విద్యావిధానాన్ని.. వివిధ సబ్జెక్టుల మధ్య అంతరాలు తెలిపేలా ఉపాధ్యాయులు అన్ని విషయాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రొఫెసర్ జయావెంకటేశ్వర్, ఎల్ఎస్ కమల, ఇందిరకంటి శంకర్ తదితర అధ్యాపకులు శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ పొందిన అధ్యాపకులకు ప్రొఫెసర్ పద్మావతి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు


జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్‌కు అవార్డును బహూకరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, బింగి నరేందర్‌గౌడ్, విజయలక్ష్మి

జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్‌కు
వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్‌లో చోటు

చిక్కడపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తొడుపునూరి అమర్‌నాథ్‌గౌడ్‌కు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్‌లో చోటు దక్కింది. శనివారం రాజ్‌భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ఆయనకు ఈ అవార్డును బహుకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ అమర్‌నాథ్‌గౌడ్ అందిస్తున్న న్యాయసేవలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. 2017 నుంచి 2021 వరకు హైదరాబాద్‌లోని ఉమ్మడి హైకోర్టులో సేవలందించారు. 2021 నుంచి త్రిపుర హైకోర్టులో ఆయన సేవలందిస్తున్నారు. అనేక కేసుల పరిష్కారంలో ఆయన చూపిన అసాధారణ ప్రతిభ కారణంగా ఆయనకు ఈ అవార్డు దక్కిందని వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ ఇంటర్నేషనల్ ఇండియా కో-ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. న్యాయాన్ని అందించడంలో అమర్‌నాథ్‌గౌడ్ అత్యుత్తమ నిబద్ధత, అంకితభావం చూసి ఆయనను ఈ రికార్డుకు ఎంపిక చేశామన్నారు. ఆయన ఇచ్చిన విశేషమైన తీర్పులు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో ఆయన పేరు నమోదుకు కారణమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

'పురాణాలు, ఇతిహాసాలపై
బాలలకు అవగాహన కల్పించాలి'

చిక్కడపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పురాణాలు, ఇతిహాసాలపై బాలలకు అవగాహన కలిగించాలని ప్రముఖ కవి, రచయిత రఘుశ్రీ అన్నారు. నెహ్రూ జయంతి, బాలల దినోత్సవ సందర్భంగా నిర్వహించిన పౌరాణిక క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానసభ శనివారం త్యాగరాయగానసభలో జరిగింది. అధ్యక్షత వహించిన రఘుశ్రీ మాట్లాడుతూ అన్ని శాస్త్రాలకు మూలం మహాభారతం అన్నారు. మన పురాణాల్లో గణిత, రసాయన, భౌతిక శాస్త్రాలు నిబిడీకృతమై ఉన్నాయన్నారు. వర్తమాన, భవిష్యత్ తరాలకు మన పురాణాలు, ఇతిహాసాల గురించి తెలియజేయాలన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ అధికారి పెద్దూరు వెంకటదాసు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బండారుపల్లి రామచంద్రరావుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం బహూకరించారు. కార్యక్రమంలో సాహితీ జిగీష సంస్థ వ్యవస్థాపకురాలు పులిగడ్డ విజయలక్ష్మి, కార్యదర్శి లలితవాణి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్
చైర్మన్‌గా నర్సింహారెడ్డి



బర్కత్‌పుర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్‌గా వేమిరెడ్డి నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. శనివారం కాచిగూడలోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వైస్‌చైర్మన్‌గా టి. సుధీర్‌రెడ్డి, డైరెక్టర్లుగా బి. రాంరెడ్డి, ఏ. జైపాల్‌రెడ్డి, జి నిర్మలాదేవి, జి. క్రాంతిరెడ్డి, ఘనశ్యామ్ బేటి కె శ్రీరాములు తదితరులు ఎన్నికయ్యారు. ప్రభుత్వ కో-ఆపరేటివ్ సొసైటీ జాయింట్ రిజిస్ట్రార్ వై పరమిళాదేవి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈసందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ జాతీయ బ్యాంకులతో సమానంగా అర్బన్ బ్యాంకులు అందిస్తున్న సేవలను గుర్తించాలని కోరారు.

18 నుంచి రాజ్యాంగంపై అవగాహన శిబిరాలు

బర్కత్‌పుర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై అన్నివర్గాల ప్రజలకు పూర్తి అవగాహన పెంపొందించడానికి ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు దక్షిణ భారత అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్ తెలిపారు. శనివారం జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్లకుంటలోని జేఏసీ కార్యాలయం లో ప్రతి రోజూ సాయంత్రం 4 గంటలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విశ్రాంత న్యాయమూర్తులు, సుప్రీం కోర్టు, హైకోర్టు సీనియర్ న్యాయవాదులు పాల్గొని రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. నవంబరు 26ను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినాలుగా ప్రకటించాలని ప్రాథమికస్థాయి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు రాజ్యాంగంపై పూర్తి అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

రేపు, ఎల్లుండి వినియోగదారుల సమావేశాలు

చిక్కడపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 18, 19 తేదీల్లో వినియోగదారుల జాతీయ సమావేశాలను నిర్వహిస్తున్నారు. 18న జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం, 19న వినియోగదారుల రక్షణ చట్టం 2019 అమలులో వివిధ ప్రభుత్వ శాఖల ప్రాధాన్యం అంశంపై జాతీయ సదస్సు ఉంటుందని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సదస్సులో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో బంగారు ఆభరణాలపై హాల్‌మార్కింగ్, యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్, వంటనూనెలు, పాలపొడిలపై శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

24న పౌరాణిక పద్యనాటకాల ప్రదర్శన

చిక్కడపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పురాకృతి రంగస్థల కళావేదిక వార్షిక కార్యక్రమం ఈనెల 24న త్యాగరాయగానసభలో నిర్వహిస్తున్నామని సంస్థ నిర్వాహకులు పుట్రేవు నాగేశ్వరరావు తెలిపారు. పౌరాణిక పద్యనాటక మణిరత్నాలు పాదుకా పట్టాభిషేకం, భక్తపోతన, శ్రీకృష్ణరాయబారం ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ప్రముఖ సీనియర్ నటులు మల్లాది గోపాలకృష్ణకు, కె.ఇందిరాదేవికి ఆత్మీయసత్కారం, ఉప్పలపాటి సైదులుకు జీవనసాఫల్య పురస్కారం అందజేస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ -1 పరిధిలో వివిధ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. రెడ్‌రోజ్, జగదీశ్‌మార్కెట్ ఫీడర్‌లో ఆదివార ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఐసీ క్వార్టర్స్, లిటిల్‌ఫ్లవర్, కలెక్టర్ ఆఫీస్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.